చిటుకలో ముంచుకొచ్చే ముప్పు

- జీవాలకు వ్యాధి సోకితే క్షణాల్లో మృత్యువాత
- హిందూపురం డివిజన్‌లో 6.50 లక్షల గొర్రెలు, మేకలు
- వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ తప్పనిసరంటున్న పశువైద్యులు

లేపాక్షి: గొర్రెల్లో వచ్చే వ్యాధుల్లో చిటుక వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది. ఈ వ్యాధికి గురైన గొర్రెలు.. చిటుక వేసినంత సమయంలోనే మృత్యువాత పడతాయి. అందుకే ఈ మహమ్మారిని చిటుక వ్యాధి అంటారు. దీనినే కొన్ని ప్రాంతాల్లో నెత్తి పిడుగు వ్యాధి అని కూడా పిలుస్తారు. తొలకరి వర్షాల వలన పెరిగిన పచ్చికను అతిగా మేపడం లేదా తినడం వలన ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యాక్సినేషన్ కచ్చితంగా వేయిస్తే వ్యాధికి చెక్‌పెట్టొచ్చని పశువైద్యాధికారులు చెబుతున్నారు.


గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యులు

వ్యాధి లక్షణాలు

హిందూపురం డివిజన్ పరిధిలో మొత్తం 6.50 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. చిటుక వ్యాధిని కలుగచేసే వ్యాధికారకము 'క్లాస్ట్రిడియం పర్ఫింజెన్స్'. ఇది బాగా పుష్టిగా, బలంగా ఉన్న జీవాలకు ఎక్కువగా వ్యాపిస్తుంది. ఎలాంటి లక్షణాలు చూపకుండానే అకస్మాత్తుగా గాలిలో ఎగిరి చిటుకలో మరణిస్తాయి. కొన్ని జీవాలు మరణించడానికి ముందు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ తలను గొడకు లేదా చెట్టుకు ఆనించి ఉంచడం , పళ్లను కొరకడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం చేస్తాయి. కడుపు నొప్పి అధికంగా ఉంటుంది. రక్తంతో కూడిన విరేచనాలు, కాళ్ల బిగుసుకు పోయినట్టు నడుస్తాయి. కడుపు ఉబ్బిపోయి, మూర్ఛతో మరణిస్తాయి.

నివారణ చర్యలు

వ్యాధి నివారణ టీకాలు మే నెలలో తప్పకుండా వేయించాలి. 15 రోజుల అనంతరం బూస్టర్ డోస్ కూడా తప్పనిసరిగా వేయించాలి. టీకాలు వేసేందుకు 15 రోజులు ముందు నట్టల నివారణ మందులు తాపితే మంచి సత్ఫలితాలను పొందవచ్చు. వర్షాకాలంలో పచ్చిక అధికంగా ఉన్నప్పుడు జీవాలను అరమేత మేపాలి. కడుపు నిండా మేపకూడదు. వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని జీవాలకు మేపకూడదు. పాలుతాగే గొర్రె పిల్లలు అధికంగా పాలు తాగకుండా జాగ్రత్త తీసుకోవాలి. అకస్మాత్తుగా దాణా మార్చకూడదు.

వైద్య చికిత్స ఇలా..

చిటుక వ్యాధి సోకిన జీవాలు సాధారణంగా చికిత్స చేసేలోపే మరణిస్తాయి. కొన్ని సందర్భాల్లో విరోచనాలు తగ్గించడానికి యాంటీడయేరియా తాపించడం, సెలైన్లు ఎక్కించాల్సి ఉంటుంది. యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులను 3 నుంచి 5 రోజుల పాటు డాక్టర్ సలహా మేరకు వాడాలి. వ్యాధి సోకిన జీవాలకు పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం డాక్టర్ సలహా, పర్యవేక్షణలో తాపితే పశువులు కోలుకునే అవకాశం ఉంది.

చిటుక వ్యాధి నివారణకు వ్యాక్సిన్



హిందూపురం డివిజన్ పరిధిలో కున్న గొర్రెలకు చిటుక వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ వేస్తున్నాము. డివిజన్ పరిధిలో వున్న 11 మండలాల్లో 6.50 లక్షల గొర్రెలు, లక్ష మేకలు ఉన్నాయి. ఇప్పటికే దాదాపుగా జీవాలన్నింటికీ వ్యాక్సినేషన్ చేయించే చర్యలు చేపట్టాము. అయితే ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అవసరమైన చోట వ్యాక్సినేషన్ వేస్తున్నాము. రెండో విడత జూన్‌లో వేయడం జరుగుతుంది.

- పెంచలయ్య, డిప్యూటీ డైరెక్టర్ పశుసంవర్ధకశాఖ, హిందూపురం



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	30.0
పెనుకొండ	33.0
మడకశిర	30.0

క్లుప్తంగా

కౌన్సిలర్‌కు పరామర్శ


కౌన్సిలర్ రాధమ్మను పరామర్శిస్తున్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 38వ వార్డు కౌన్సిలర్ రాధమ్మను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పరామర్శించారు. ఇటీవలే శస్త్రచికిత్స చేయించుకున్న రాధమ్మను సోమవారం ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె అదే వార్డుకు చెందిన బూత్ కమిటీ కన్వీనర్ సదాశివరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

మా భూమి ఇప్పించండి.. సారూ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధితులు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామానికి చెందిన దళిత లక్ష్మమ్మ, మారెక్క, సిద్దప్ప తాము సాగు చేసుకుంటున్న భూమిని తమకు ఇప్పించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత 75 సంవత్సరాల నుంచి సర్వే నంబర్ 153-1లోని 5.76 ఎకరాల భూమిని తాము సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు తెలిపారు. అయితే తమకు తెలియకుండా శివానంద, ఈరమ్మ, లక్ష్మీదేవి అక్రమంగా వారి పేరుతో 1బీ చేయించుకున్నారని వాపోయారు. అక్రమంగా తమ భూమిని 1బీలో ఎక్కించుకున్న వారిని పిలిపించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాహెబ్ సిద్ధాంతాలను ఇంటింటికీ ప్రచారం చేసి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగేంద్రప్ప తెలిపారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్, బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అర్బన్ సీఐ సురేశ్ , విశ్రాంత ప్రిన్సిపాల్ బసవలింగప్ప , కేఏఎస్ కోచర్ శివ కుమార్ , ప్రముఖ దళిత నేత ఉగ్రప్ప , డీజేఎస్ నారాయణప్ప, ముత్తురాజు, వెంకటరమణప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూజలు చేసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు జ్యోతులు మోశారు.

మడకశిరలో చిరు జల్లులు


మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిరరూరల్: నైరుతి రుతు పవనాలు కారణంగా సోమవారం ఉదయం నుంచి మడకశిర పట్టణంలో జల్లుల వర్షం పడుతునే ఉంది. దీంతో కోతకు వచ్చిన వరి, రాగి, మొక్కజొన్న తదితర పంటలు కోత కోసుకునేందుకు పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెరుగైన సేవలు అందించండి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలు, వేసవి కాలానికి సంబంధించి అవసరమైన మందులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు.

వేతనాలు పెంచాలని నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ వర్కర్లు

చిలమత్తూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ వేతనాలు పెంచాలని హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలియజేశారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు ఇవ్వాలని, టెక్నికల్ ఇంజినీర్లకు రూ. 29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 కనీస వేతనం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత 19 రోజులుగా నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వం వేతన పెంపుపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరగౌడ్ , ఇంజనీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులను ప్రోత్సహించిన ఘనత జగనన్నదే


బాలాజీని సన్మానిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: యువ న్యాయవాదులను లా నేస్తం ద్వారా ప్రోత్సహించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ జాయింట్ సెక్రటరీ, మాజీ ఏపీపీ నాగరాజు తెలిపారు. పట్టణంలోని న్యాయవాదుల సమావేశపు భవనంలో సోమవారం సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు నేతృత్వంలో వైఎస్సార్ సీపీ మండల లీగల్‌సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన బాలాజీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లానేస్తం ద్వారా ప్రతినెలా రూ. 3 వేలు సాయం అందించి యువ న్యాయవాదులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంతో ఉపయోగపడిందన్నారు. అందువల్ల న్యాయవాదులు వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. బాలాజీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరీష్, జావిద్, రవి, నాగిరెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక


టీఎన్ దీపికను సన్మానిస్తున్న క్రైస్తవులు

చిలమత్తూరు: నియోజకరవర్గంలోని క్రైస్తవులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఇటీవలే క్రిస్టియన్ మైనార్టీ సెల్ సెక్రటరీగా నియమితులైన డా. నాగేంద్రకుమార్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మింటు తదితరులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దీపికను సన్మానించారు. దీపిక మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి తప్పక స్పందించి అండగా నిలుస్తామన్నారు. అనంతరం పాస్టర్లు .. దీపిక, వేణురెడ్డిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాస్టర్లు స్టీఫెన్ రాజు, సూర్యప్రకాష్, శ్రీకాంత్, చర్చి యూత్ శ్యాంబాబు, మెస్సి రొనాల్డో, డేనియల్ శ్రీరామ్, అరుణ్‌కుమార్, సాల్మన్ రాజ్,రూబెన్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతికి నివాళి


గోవిందాచారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బంగారు నగల షాపు యజమాని గోవిందాచారి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మృతుని ఇంటి వద్దకు చేరుకుని గోవిందాచారి మృతదేహం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గోవిందాచారి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మా రేషన్ షాపు ఎక్కడో చెప్పండి !


గ్రీవెన్స్‌లో వినతి ప్రతం అందిస్తున్న 24వవార్డు ప్రజలు

హిందూపురం: మా వార్డు రేషన్ షాపు ఎక్కడో తెలియడం లేదు సార్.. రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి ఎక్కడి వెళ్లాలో చెప్పండి.. అంటూ పట్టణంలోని 24వ వార్డు ప్రజలు తహసీల్దార్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతి పత్రం అందించారు. 24వ వార్డులో షాప్ నంబర్ 11 కనిపించడం లేదని, రేషన్ కోసం వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గతంలో రేషన్ షాపు తమవార్డులో అందుబాటులో ఉండేదని తెలిపారు. అలాగే ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారని, అయితే ఇప్పుడు ఆ రేషన్ దుకాణాన్ని ఎక్కడ పెట్టారో కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కోసం 15 వార్డుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వెంటనే స్టోర్‌ను స్థానిక వార్డులోకి మార్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ నాగేంద్రప్రసాద్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


నాయకులతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి తెలిపారు. కదిరేపల్లి పంచాయతీకి చెందిన మండల వైస్ ప్రెసిడెంట్ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కెంచప్ప, నాయకులతో కలిసి సోమవారం సిద్దగిరిలో జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతంపై వారితో చర్చించారు. సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


అమరాపురంలో యోగా చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు


లేపాక్షి: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, యోగా అభ్యాసకులు

అమరాపురం: మండలంలోని ప్రజలు రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవచ్చని తహసీల్దార్ లక్ష్మీ నరసింహా, ఎంపీడీఓ రామరావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీఓ స్థానిక ప్రజలతో కలసి యోగ సాధన చేశారు.

హిందూపురం: మండలంలోని సంతేబిదనూర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సోమవారం యోగా పోటీలు నిర్వహించారు. రెండురోజల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మంగళవారం మండలంలోని సంతేబిదనూర్ గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

లేపాక్షి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్న ఉద్దేశంతో తహసీల్దార్ సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి


మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పరిగి: 'ఆపరేషన్ సింధూర్'లో వీరమరణం పొందిన మురళీనాయక్ స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని వక్తలు అన్నారు. మండలంలోని సేవా మందిరంలో సోమవారం మురళీ నాయక్ సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జై జవాన్.. జై కిసాన్ స్ఫూర్తిని దేశ వ్యాప్తంగా ఇనుమడింపజేయాలన్నారు. అనంతరం నిర్వహించిన స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించి అందరినీ అలరించింది. కార్యక్రమంలో కేటీ శ్రీధర్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాకారుల సంఘం అధ్యక్షుడు రామలింగప్ప, ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప, హిందూపురం ఎంఈఓ గంగప్ప, బీఎడ్ కాలేజ్ ప్రిన్సిపాల్ చాంద్‌బాషా, బీజేపీ నాయకుడు బంగారు చంద్ర, ఉపాధ్యాయులు రామలింగయ్య, అశ్వర్థ నారాయణ, గోపీనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


యూనియన్ బ్యాంకు దర్గా సర్కిల్ శాఖను ప్రారంభిస్తున్న రీజినల్ హెడ్ జితేంద్ర మిశ్రా

పెనుకొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ జితేంద్రమిశ్రా సిబ్బందికి సూచించారు. పట్టణంలోని కుమ్మరదొడ్డి సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంక్ శాఖ కార్యాలయాన్ని పట్టణంలోని దర్గా సర్కిల్ వద్దకు నూతన భవనంలోకి మార్చారు. సోమవారం శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు మేనేజర్ కడపల శ్రీనివాసులు బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీక్షా హోమం


దీక్షా హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో నిర్వహిస్తున్న శనీశ్వరస్వామి జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దీక్షా హోమాన్ని నిర్వహించారు. అలాగే ఆవాహిత దేవతారాధన, విష్ణు సహస్త్ర నామార్చన, ఉపనిషత్ పారాయణ, మహా మంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

పరిగి: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సోమవారం జరిగింది. పరిగికి చెందిన గ్రీన్‌స్టార్ జట్టు విజయం సాధించగా... రన్నర్‌గా పరిగికి చెందిన లెవెన్ స్టార్ జట్టు నిలిచింది. బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎస్ఐ రంగడుయాదవ్, ఎంపీడీఓ రెడ్డెప్ప, ఎంఈఓ లక్ష్మీదేవి, హెచ్ఎం కృపాసత్యరాజు, క్రీడాకారులు, నిర్వాహకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలాన్ని కాపాడండి

గోరంట్ల: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి రోడ్డు స్థలాన్ని అక్రమించి పొలాలకు వెళ్లే రైతులు, గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అక్రమణదారునిపై చర్యలు తీసుకొని రస్తా సమస్యను పరిష్కరించాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ మారుతీ ప్రసాద్‌కు విన్నవించారు.

డబ్బు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు ఎంఈఓ గంగప్పకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు టీసీలు ఇవ్వడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక్కొక్కరితో రూ. 200 నుంచి 500 వరకు వసూలు చేయడంపై మండిపడ్డారు.

నాణ్యమైన విత్తనకాయలు అందించండి

పావగడ: తాలూకా వ్యాప్తంగా నాలుగు హోబళీలకు చెందిన రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయను పంపిణీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ వ్యవసాయశాఖ ఏడీ అజయ్ కుమార్‌కు సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం నిర్వహించిన విత్తన కాయ పంపిణీ కార్యక్రమంలో ఆయన రైతులకు విత్తన కాయను పంపిణీ చేశారు. విత్తన పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

యువతి ఆచూకీ లభ్యం


యువతిని తహసీల్దార్ షేక్షావలి ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు పంచాయతీ కేంద్రానికి చెందిన ఎం.కవిత ఆచూకీ లభ్యమైంది. తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఈనెల 14న స్థానిక పోలీసు స్టేషన్‌లో తండ్రి మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా విశాఖపట్నంలో ఉన్నట్లుగా గుర్తించి సోమవారం స్టేషన్‌కు పిలిపించామని జమేదార్ రామలింగయ్య తెలిపారు. తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి చేసుకున్నట్లు కవిత తెలిపిందన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్షావలి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు. అనంతరం పెద్దల సమక్షంలో తల్లిదండ్రులకు ఆమెను అప్పగించారు.

పొదుపు చేసుకోండి

రొళ్ల: గ్రామాల్లో డ్వాక్రా మహిళలు పొదుపు సంఘాలను బలోపేతం చేసుకుని కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీఎం నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో మండల సమైక్య అధ్యక్షురాలు రత్నమ్మ అధ్యక్షతన జరిగింది.

ఎకరాకు ఐదు బస్తాల విత్తనాలివ్వాలి


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగు చేయడానికి రైతులకు ఎకరాకు ఐదు బస్తాల చొప్పున వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు వేరుశనగ విత్తనాన్ని అందించి ఆదుకోవాలని కేవీపీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు యోగానంద్ మాట్లాడుతూ రైతులు తమ భూములను విత్తనం వేయడానికి సిద్ధం చేసుకుని ఉంచుకున్నారని, ఇంత వరకూ ప్రభుత్వం విత్తనాన్ని అందించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఎకరాకు ఐదు బస్తాల చొప్పున విత్తన కాయలను అందించాలన్నారు. 90శాతం సబ్సిడీతో విత్తన కాయలను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉగ్రనరసింహప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నిద్ర మత్తు వీడి రైతులకు వెంటనే సబ్సిడీతో విత్తన కాయలను పంపిణీ చేయాలన్నారు. అనంతరం రైతులతో కలిసి రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి

హిందూపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకునేలా చూడాలని ప్రభుత్వం తపాలాశాఖకు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు హిందూపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యూ.విజయ్‌కుమార్ తెలిపారు.

2న పెనుకొండలో నిరసన

పెనుకొండ: నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తోడుగా ఉంటున్న ఆర్డీటీ సంస్థకు కేంద్రం ఎఫ్‌సీఏఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 2న పెనుకొండ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా నిరసన చేయనున్నట్లు స్థానిక సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి తెలిపారు. ప్రజలు నిరసనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.